# మీటింగ్ పెళ్ళి

## రంగనాయకమ్మ

మీటింగుపెళ్ళి జరుగుతోంది. సభలో జనం బాగానే వున్నారు. మినిస్టర్ గారొకాయన వేదికమధ్య పెద్దకుర్చీలో, వూలదండలతో కూర్చుని వున్నారు.

'మంత్రిగారి పెళ్ళా?' అని వచ్చేవాళ్ళు ఆశ్చర్యపడి కాస్సేపటికి కాదని తెలుసుకొని అసలు వధూవరుల్ని చూసి మళ్ళీ ఆశ్చర్యపడుతున్నారు.

సమయానికి చాకలి బట్టలు తేకపోతే పెట్టి అడుగున పడేసిన గుడ్డలేవో బయటికి తీసి తొడుక్కొచ్చిన వాడిలాగున్నాడు- పెళ్ళికొడుకు.

పెళ్ళికూతురికి కూడా పెళ్ళికూతురు లక్షణాలేకోశానా లేవు. వాగరాలూ, బాసికాలూ, పెట్టుకోకపోతే మానె, పట్టుచీరన్నా కట్టుకోలేదు. వడ్డాణాలూ చంద్రహారాలూ ధరించకపోతే మానె, చేతికి ఒక్కగాజన్నా వేసుకోలేదు. పసుపు పారాణులూ కళ్ళకాటుకలూ దిద్దుకోకపోతే మానె. నుదుట చిన్నబొట్టన్నా పెట్టుకోలేదు. వోరచూవులు కురిపిస్తూ తలవొంచుకోకపోతే మానె, కాస్త సిగ్గన్నా అభినయించడం లేదు- పైగా తనే ఎవరి పెళ్ళికో వొచ్చినట్టు దిక్కులు చూస్తోంది. అప్పుడప్పుడు పెళ్ళికొడుకువేపు చూసి, నవ్వి మాట్లాడుతోంది. వధూవరులిద్దరూ పాత్రలకు ఘోరాన్యాయం తలపెట్టిన వాళ్ళలాగున్నారు.

పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురూ అంత ఏబ్రాసుల్లా వున్నందుకు- పెళ్ళిబట్టల ధగద్ధగలతో అలంకారాల తళత్తళలతో చూడముచ్చటగా లేనందుకు- ప్రేక్షకుల్లో కొంచెం ఎక్కువమందే అసంతృప్తి చెందుతున్నారు. ఆ వధూవరుల పక్కన వూలదండల మంత్రిగారు వుండబట్టి, ఆయన మొహంలో, బట్టల్లో, ఠీవితో, పెళ్ళికళ వుట్టిపడబట్టి, ఆ ప్రేక్షకులు కొంతన్నా వూరట చెందగలుగుతున్నారు. ఆ పద్ధతి మీద కూడా సంతృప్తి పొందక ఇంకా అసంతృప్తి చెందేవాళ్ళు చెందుతోంటే, నిరుత్సాహపడేవాళ్ళు పడుతున్నారు.

ఈ పెళ్ళికొచ్చినందుకు వాళ్ళకా శిక్ష చాలదన్నట్టు రెండు గంటల నుంచీ నలుగురు పెళ్ళిపెద్దలు ఒకరితర్వాత ఒకరు ఉపన్యాసాలకు వూనుకుని ప్రేక్షకుల్ని తమ శాయశక్తులా విసుగెత్తిస్తున్నారు. కొందర్ని పరిగెత్తిస్తున్నారు. ఆ వుపన్యాసకుల్ని చూస్తూ వుంటే వాళ్ళకి జీవితమంతా అలా మైకు పట్టుకుని నిద్రాహారాలు లేకుండా వుపన్యసిస్తూ వుండడాన్ని మించిన ఆనందం ఇంకేమీ వుండదనీ- అప్పుడప్పుడూ వాళ్ళు కోరుకునే ఏ సిరిసంపదలూ, ఏ మంత్రిపదవులూ ఏ భగవద్దర్శనాలూ, ఏ సినిమా తారతో గ్రూప్ ఫోటోలూ, ఈ జగత్తులో ఇంకే కార్యమూ అలా మైక్ పట్టుకుని వుపన్యసిస్తూ, వుపన్యసిస్తూ ఇంకో స్పీకర్‌కి మైక్ ఇచ్చేయ్యాలనే వూహనే మెదడులోకి జొరబడనివ్వకుండా మైకుని స్వంతం చేసేసుకుని మైకుని ఆలింగనంలోకి లాగేసుకుని, మైక్‌ని తనలో తనని మైక్‌లో ఐక్యం చేసేసుకుని- అలా... అలా... అలా... వుపన్యసిస్తూ కన్ను మూసెయ్యడాన్ని మించిన బ్రహ్మానందం ఇంకెక్కడా పొందలేరనీ- మహా ఓపికమంతుడైనా, మొహమాటస్తుడైన, సహనశీలియైన ప్రేక్షకుడికి కూడా తెలిసిపోతోంది.

పదకొండో ఏట పెళ్ళిచేసుకుని స్నేహితుళ్ళనందర్నీ విడిచి బావురుమని ఏడుస్తూ అత్తవారింటికి పోతున్న ఏ వూర్ణమ్మలాగానో, లక్ష్మమ్మలాగానో, ఒక్కొక్క వుపన్యాసకుడూ మైక్‌ని వదల్లేక, వదల్లేక వదల్లేక వదిలినప్పుడల్లా-

'హమ్మయ్య! వీడు వొదిలాడు!' అంటున్నారు కొంచెం ధైర్యస్తులు.

'వొదిలాడంటావా? అదుగో! మళ్ళీ వొస్తున్నట్టున్నాడు' అని తర్వాత వుపన్యాసకుణ్ణి చూసి, మళ్ళీ మొదటివాడే వొస్తున్నాడని భ్రమ చెందుతున్నారు- అప్పటికే కొంత మానసిక రుగ్మతకు లోనై తమ కళ్ళని తామే నమ్మలేకపోతున్న రోగగ్రస్తులు.

అప్పటికి నలుగురు పెద్దలు మాట్లాడారు. మొదటాయన మాట్లాడిందే రెండో ఆయన మాట్లాడాడు. మొదటాయనా రెండో ఆయనా మాట్లాడిందే మూడోఆయనా మాట్లాడాడు. మొదటాయనా, రెండోఆయనా, మూడోఆయనా మాట్లాడిందే నాలుగో ఆయన మాట్లాడాడు.

ఇప్పుడు ఐదో ఆయన లేచాడు. ఈయనేమైనా కొత్త వుంతలు తొక్కుతాడేమోనని చాలామంది ప్రేక్షకులు ఆశించారు. ముఖ్యంగా పెళ్ళికూతురు ఆశించింది.

కానీ ఐదోఆయన అపాటే ఎత్తుకున్నాడు. తన వెనకటి పెద్దలు తనకు మైకువొదిలారన్న కృతజ్ఞతతో ఏమో ఈయనా వాళ్ళదారికే ముఖం తిప్పాడు.

ఒక బ్రాహ్మణ యువతి ఒక హరిజన యువకుణ్ణి పెళ్ళాడడం మహాద్భుత సాహసోపేతమైన కార్యంట! ఒక శ్రోత్రియ బ్రాహ్మణుడు తన కుమార్తెను ఒక హరిజనుడికిచ్చి వివాహం జరపడం ఇంతో అంతో చెప్పలేనంత మహత్తర ఘనకార్యంట- ఐదో ఆయన కూడా పాత పెద్దలలాగే పెళ్ళి కుమార్తెని, ఆమె తండ్రిగారినీ పొగడ్తలతో ముంచెత్తేశాడు- వారిద్దరూ అంత ముందడుగు వేస్తున్నాందుకు! అంత అభ్యుదయ పథంలో నడుస్తున్నందుకు! అంత సర్వమానవ సమానత్వం సాధిస్తున్నందుకు!- ఇంకా చాలా చాలా అన్నాడు. ఆయనకు చాలా మాటలు వచ్చునని ప్రేక్షకులు వొప్పకోక తప్పని ఇరకాటంలో పెట్టేశాడు- మొదటి దఫా పొగడ్తలు ముగించి ఒకసారి పెళ్ళికొడుకు వేపు వోరచూవు చూశాడు. -వీడి సంగతే విటన్నట్టు. ఇక తర్వాత కులాంతర వివాహాలకే ప్రాశస్త్యం గురించి ఎత్తుకున్నాడు- అది కూడా పాతవాళ్ళలాగే. మైకు ఇచ్చారన్న కృతజ్ఞతే మరి అది.

విసుగొచ్చేస్తోంది సుశీలకి. ఐదురోజుల పెళ్ళో, మూడు రోజుల పెళ్ళో, ఒక్కరోజు పెళ్ళో చేసుకో అక్కర్లేకుండా కాస్సేపు కుర్చీల మీద కూర్చుని మీటింగ్ పెళ్ళి చేసుకోడానిక్కూడా విసుగొచ్చేస్తోంది- సుశీలకి.

'ఏమిటీగోల?' అన్నట్టు రాధాకృష్ణ వేపు చూసింది.

అతను కొంచెం నవ్వి 'విసుగ్గా వుందా!' అన్నాడు.

'ఏం? నీకు లేదా?' అని కోపం తెచ్చుకుంది సుశీల.

అతను నవ్వి తన తరతరాల హరిజన సహనం చూపించి వూరుకున్నాడు.

ఐదో వుపన్యాసం సాగుతోంది- పెద్ద పెద్ద కేకల్తో ఆయనకు మైక్‌లో విశ్వాసం పోయినట్టుందా క్షణాల్లో. యంత్ర సహకారాన్ని తిరస్కరించి, తన కంఠస్వరాన్నే హెచ్చించి హెచ్చించి, తన వుపన్యాసాన్ని మర్నాడు పేపర్లలో సరిగ్గా ముద్రిస్తారో లేదో, వేదిక పక్కనే కూర్చున్న జర్నలిస్టులు సరిగ్గా రాసుకుంటారో లేదో అనే అపనమ్మకంతో తన వుపన్యాసం ఇప్పడే ఇక్కడినించే ఒక్క అక్షరం వమ్ముగాకుండా యావత్ భారతదేశానికి వినిపించేట్టు విశ్వ ప్రయత్నాలు సాగిస్తున్నాడు. ఆ పరమాద్భుత క్షణాలలో భారతదేశంలో గోలలన్నీ అణగారిపోయాయి. బస్సులూ, రైళ్ళూ, విమానాలూ, పిల్లలూ, పిట్టలూ, జంతువులూ అన్నీ, అంతా ఆ వుపన్యాసకుడి మహోన్నత కంఠస్వరం కిందపడి నిశ్శబ్దమై పోయాయి. ఆ కంఠం ఒక్కటే... క్షణక్షణానికీ వుత్సాహం పెంచుకుంటూ భారత భూమ్యాకాశాల్ని ఆక్రమిస్తోంది.

'హరిజనులు యెవరు?' అని ఒక భేరీ నినాదం వంటి గావుకేక పెట్టారాయన.



'హరిజనులు అంటరానివారేనా?' అని ఇంకో యుద్ధ వివాదం చేశాడు.

ఆ తర్వాత తన చిన్నతనంలో తనకు హరిజన ప్రేమ ఎలా పుట్టుకొచ్చిందో వ్యక్తొచ్చాడు.

'... ఒకసారి... నేను నా చిన్నతనంలో... ఒకసారి... ఒక... హరిజన బాలుడితో ఆడుకున్నాను... వాడి వీపు మీద... నేను... గుర్రం ఎక్కి... నన్ను ఎంతో ఆనందంగా... వాడు మొయ్యడం... నేను ఎంతో ఆనందంగా... ఆ యొక్క హరిజన బాలుణ్ణి తాకి అతని వీపు ఎక్కడం... ఆ విధంగా మేము ఆడుకున్నాము... ఆ దృశ్యం మా నాయనమ్మగారు పెరట్లో తులసిపూజ చేసుకుంటూ చూశారు. ఆవిడ... అయొక్క పూజ కూడా విడిచిపెట్టేసుకుని... వీధి గుమ్మంలోకి వచ్చి నన్ను... కోపంగా పిలిచారు 'మాలవాడితో ఆడతావురా వెధవా?' అని కళ్ళెర్ర చేశారు. నన్ను వెంటనే పెరట్లోకి వచ్చి బట్టలు విడిచేసి స్నానం చెయ్యమన్నారు. '... ఎందుకు స్నానం చేయాలి?' అని. నేను ఎదురుప్రశ్న వేశాను... అటువంటి ప్రశ్న మా నాయనమ్మగారు ఎన్నడూ ఎరగరనుకోండి... నాలో విప్లవ భావాలు ఆనాడే పుదయించాయని... ఈనాడు తెలుసుకో గలుగుతున్నాను... ఇంతకీ ఆరోజున... నేను స్నానానికి రానన్నాను. గుర్రం ఆట మాననన్నాను. మా నాయనమ్మగార్ని చూసి దూరంగా



చేసిన ట్రిక్కే మళ్ళీ చేస్తూ గారడీ చెయ్యడం తమాషా కాదు
వేసిన వేషమే మళ్ళీ వేస్తూ కామెడీ చెయ్యడం మజా కాదు
రెండోది ఒకటే రకంగా అయినా ఒకటో రకంగా చెయ్యడం
ఒకటోది రెండో రకం అయినా మూడో రకంగా చెయ్యడం
ట్రిక్కూ కామిక్కూ కలిపేసిని మాజిక్కులు మానిసికే
హమేషా చెల్లే తమాషా
కామెడీ గారడీ రెంటిటికీ పారడీ
మాటలోను మొటియేను శ్రీటీ రమణా రెడీ

పోయి నించున్న ఆయొక్క హరిజన బాలుడి వీపుపైకి మళ్ళీ లంఘించి వూగడం ప్రారంభించాను. ఆ విధంగా నేను... హరిజనుల్ని ప్రేమించడం... ఆనాడే నా చిన్ననాడే ఎవ్వరూ నేర్పకుండానే నేర్చుకున్నాను... ఆయొక్క సంఘటన అప్పుడే అయిపోయిందనుకోకండి... మా నాయనమ్మగారు చాలా కోపంతో ఈ సంగతి మా నాన్నగారికి నివేదించారు. ఆయన నన్ను కోపంగా అడిగారు మాలవాళ్ళతో ఆడావా అని... 'ఆడానండీ నాన్నగారూ' అని ధైర్యంగా ఒప్పుకున్నాను. 'ఆడితే వెంటనే శుచిగా స్నానం చెయ్యాలని తెలియదురా సన్నాసీ?' అని కోప్పడ్డారు మా నాన్నగారు. ఆయన గొప్ప వేద పండితుడు లెండి... ఆ విధంగా ఆయన కేకలేసినా నేను అలాగే నిలబడి 'మాలవాళ్ళను ముట్టుకుంటే నేనెందుకు స్నానము చెయ్యాలి నాన్నగారూ?' అని అడిగాను'- అని వుపన్యాసకుడు ప్రేక్షకుల్ని నవ్వుమొహంతో పరికిస్తున్నాడు.

'అవును. నిన్ను ముట్టుకున్నందుకు మాలవాళ్ళు స్నానం జెయ్యాలి గాని' అని అరిచారెవరో. అక్కడ వున్న వాళ్ళంతా నవ్వారు.

'వారం పదిరోజుల కిందట ఈయన ఇంకో పెళ్ళిలో మాట్లాడ్డం చూశాను. అప్పుడు కూడా సరిగ్గా ఈ సంగతే మాట్లాడాడు' అని చెవుతున్నాడొకాయన పక్కవాళ్ళకి.

వుపన్యాసకుడు ఒక దగ్గు దగ్గాడు ప్రేక్షకుల్ని తనవేపే చూడమన్నట్టు.

'మాలలు మాత్రం మనుజులుగారా నాన్నగారూ? అని మా నాన్నగార్నే ఎదిరించాను. అప్పటినించీ నాకీ హరిజన సేవంటే...'

'తెగకోస్తున్నాడు' అంది సుశీల మొహం చిట్లించి. రాధాకృష్ణ నవ్వి 'ఈయన హరిజన సేవ గురించి వాళ్ళ వూళ్ళో వాకబు చేస్తే సరి' అన్నాడు.

'చిరంజీవి సౌభాగ్యవతి సుశీలాదేవి బ్రాహ్మణ యువతియైయ్యుండి ఒక హరిజనుణ్ణి వివాహమాడుటకు నిశ్చయించుకున్నదీ అంటే ఆ యొక్క సంస్కార భావాలకు ఆమెను నేను అభినందించకుండా వుండలేకపోతున్నాను. నా శరీరం వులకలెత్తిపోతోంది... ఆ యొక్క పెళ్ళికుమార్తె తండ్రిగారి యొక్క ధైర్యం, ఆ యొక్క అభ్యుదయ భావాలూ ఆయనను నేను అభినందించకుండా వుండలేకపోతున్నాను' మొత్తానికి ఆయన పెళ్ళికూతుర్నీ, పెళ్ళికూతురు తండ్రినీ అభినందించకుండా వుండాలనే విశ్వప్రయత్నం చేసినట్టున్నాడు.

'ఈ కాలంలో కులాలు పోయాయి. పోయాయి అంటారు. ఎక్కడ పోయాయి?' అని మళ్ళీ ఒక గావుకేక పెట్టాడు. చెవులు దురదలు పుట్టేట్టు అంత పెద్దకేక పెడితే పెట్టాడు గానీ కాస్త మంచిమాటే అన్నాడు నొప్పుకోవలసిన మాట.

'మన పద్మావతీదేవి వంటి యువతీ యువకులే...'

'పద్మావతి కాదండి... సుశీల' అన్నాడు పద్మావతి తండ్రి గాని సుశీల తండ్రి.

'అదేననుకోండి... మన సుశీలాదేవి వంటి యువతీ యువకులే ఈ అభ్యుదయ పథాన నడిచి...' అవే మాటలు! అవే కేకలు! అవే ప్రశంసలు! అవే గింగిరాలు!

సుశీల రాధాకృష్ణని చాలా స్నేహితంగా ప్రేమగా, ఆప్యాయంగా చూస్తోంది అప్పుడప్పుడూ.

పెద్దలు హరిజన సామభూతి కురిపించినప్పుడు అతనేమంటాడో సుశీలకు తెలుసుగానీ ఇప్పుడు... ఇక్కడ... ఏమనుకుంటున్నాడో తెలీడం లేదు.

రాధాకృష్ణ సుశీలని చూసి నవ్వుతూ-

'నన్ను చేసుకుంటున్న నీ సాహసానికి ఎన్ని పొగడ్తలో చూశావా?' అన్నాడు.

'పొగడ్తలా, పాడా? నువ్వు హరిజనుడివై నా ప్రాణాలు తీస్తున్నావు' అని విసుక్కుంది సుశీల.

అప్పుడొక అత్యద్భుతమైన విషయం జరిగింది. ఐదో వుపన్యాసకుడు మైక్ పట్టుకుని పూర్తిగా గంటన్నర వేళ్ళాడకుండా రెండు నిమిషాల ముందే గంటా ఇరవయ్యేడు నిమిషాలకే వుపన్యాసం ముగించి ఆరో ఆయనికి మైక్ ఇచ్చేశాడు. ఆ కార్యం ప్రేక్షకుల్ని మొదట దిగ్భ్రాంతుల్ని చేసింది. గత వుపన్యాసకులెవ్వరూ చెయ్యని అంత వుదారకార్యం ఐదో వుపన్యాసకుడు చేసినందుకు ప్రేక్షకులందరి కళ్ళూ చెమ్మగిల్లాయి. ఆ వుదార పురుషుడికి వీడ్కోలు చెవుతూ కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. కెమెరాలన్నీ ఐదో వుపన్యాసకుడి చుట్టూ ప్రదక్షిణలు తిరిగాయి. జర్నలిస్టులు గబగబా పదేసి పేజీలు రాసుకున్నారు. రెండు నిమిషాల ముందు మైక్ విడిచిపెడితే ఎంత కీర్తివస్తుందో ఆ క్షణంలో వుపన్యాసకులందరికీ చక్కగానే అర్థమైంది.

మరో ఆయన గంభీర వదనంతో లేచాడు. ఈయన కొంచెం కొత్తదారి తొక్కినట్టే కనపడ్డాడు. కట్నపిశాచాన్ని హతమార్చి భారత యువతుల జీవితాలు మంగళప్రదం చెయ్యవలసిన బాధ్యత యువతరం మీద, యువతరం తండ్రుల తరం మీదా వుందన్నాడు. ఈ కులాంతర, మతాంతర, కట్నాంతర వివాహాలు మాత్రమే ప్రగతి పథానికి బాట వేస్తాయనీ, ఇటువంటి వివాహం వూరుకొక్కటి జరిగితే చాలు సర్వానర్థాలూ పోయి దేశం సిరిసంపదలతో తులదూగుతుందనీ, జనమంతా స్వర్గసుఖాలలో తేలియాడాలంటే ఈ కులాంతర వివాహాలను మించిన మార్గం లేదనీ, ఇతర మార్గాలెన్ని అయినా దీనికి సాటిరావనీ, లేవనీ, కావనీ, స్పష్టంగా తేల్చి చెప్పేశాడు. అంచేత సభికులందర్నీ ఈ మార్గాన్నేనడిచి- పెళ్లి అయిపోయిన వాళ్ళని కూడా- అభ్యుదయం సాధించమన్నాడు.

ఆయన ఓ కన్ను కెమేరా వాళ్ళమీదా, ఓ కన్ను పత్రికల వాళ్ళమీద

వేసివుంచాడు. అంచేత జనం ఎవళ్ళ సంగతులు వాళ్ళు యదేచ్ఛగా మాట్లాడుకోగలుగుతున్నారు.

ఇంతసేపు పెళ్ళి చేసుకోవడం పరమ దుర్భరంగా వుంది సుశీలకి. మొదట్లోఏదో కాస్త సరదాపడింది గానీ ఇప్పటికి అదంతా హరించిపోయింది. 'పోనీలే, ఇది నా పెళ్ళే కాదా' అని ఎంత వుత్సాహపడదామన్నా చేతకాకుండా అయిపోతోంది. 'బాబోయ్! ఇక మాకు పెళ్ళి చాలు. ఏమన్నావుంటే మీరు చేసుకోండి- అని చెప్పేయనా గట్టిగా?' అని సీరియస్‌గా రాధాకృష్ణనడిగింది.

అతను నవ్వి 'కూచోరాదూ! సరదాగానే వుందిగా?' అన్నాడు- కుర్చీ లోపలికి జరుగుతూ.

'అందుకే నువ్వు హరిజనుడివై పుట్టావు'అని కోపంగా విసుక్కుంది సుశీల.

తన పెళ్ళి ఇంత ఘోరమైన ఆలశ్యంతో జరుగుతుందని సుశీల కలలోకూడా అనుకోలేదు. ఒకవేళ రాధాకృష్ణ అనుకున్నాడేమో అని సందేహపడనక్కర్లేదు. అతను కూడా అనుకోలేదు. వాళ్ళిద్దరూ ఏమనుకున్నారంటే వాళ్ళ పెళ్ళి పది నిమిషాల్లో అయిపోవాలనుకున్నారు. మహా అయితే పదకొండు నిమిషాల్లో అయిపోవాలనుకున్నారు. అలా జరిగేట్టు అయితేనే మీటింగు పెళ్ళి చేసుకుంటాం అన్నారు.

'అలాగే చేయించేస్తాను. అసలు తొమ్మిది నిమిషాల్లో చేయించేస్తాను' అన్నాడు పిల్ల తండ్రి.

కుర్రవాగమ్మలిద్దరూ నమ్మేశారు. నమ్మేసి పెళ్ళి ఏర్పాట్లేవిటో, ఎక్కడో, ఎప్పుడో, ఎలాగో పట్టించుకోడం మానేశారు. ఫలానారోజు ఫలానా చోటికి, ఫలానా నిముషానికి రమ్మంటే వస్తాం గానీ ఇంకా మాకేం చెప్పొద్దన్నారు.

సరిగ్గా అలాగే వచ్చారు ఇందాక. తీరా చూస్తే ఇదీ సంగతి. పెద్దహాలూ, బెంచీలూ, కుర్చీలూ, మైకూ, దాని చుట్టూ వుపన్యాసకులూ.

పెళ్ళికూతురు తన వివాహభారం తండ్రిమీద పెట్టింది. ఆయన దాన్ని కులనిర్మూలన సంఘం వారి మీద పెట్టాడు. వారు తమ కీర్తి ప్రతిష్టలన్నీ వినియోగించి ఆ సభకు రాజకీయ, విద్య, వైద్య, న్యాయ, పోలీసు- మొదలైన అన్ని రంగాల నుంచీ వుపన్యాసకుల్నీ, హాలు నిండా ప్రేక్షకుల్నీ రాబట్టగలిగారు.

ఇప్పుడు సుశీల చాలా పశ్చాత్తాపపడిపోతోంది. తన పెళ్ళి ఎవరి పెళ్ళో అయినట్టు, దాని బాధ్యత తండ్రి చేతుల్లో పెట్టెయ్యడం, ఆయన దాన్ని కుల నిర్మూలన సంఘం వాళ్ళ చేతుల్లో పెట్టేయడం, వాళ్లు దాన్ని సంస్కర్తోపన్యాసకుల చేతులకప్పగించడం, వాళ్లు తమ పెళ్ళికొచ్చి, తమ ఇద్దరి అభిప్రాయాలకు విరుద్ధంగా వెధవ చెత్తంతా మాట్లాడుతోంటే తామిద్దరూ నోళ్లు మూసుకుని గుడ్లప్పగించి కిక్కురుమనకుండా వినవలసి రావడం- చాలా పొరపాటై పోయిందనీ విచారపడిపోతోంది సుశీల.

ఆరో వుపన్యాసం కూడా వెనకటి వుపన్యాసాల ధోరణిలోకి దిగిపోయింది. తనకు అసలు ఈ పెళ్ళి భోగట్టా ఎలా అందిందో, అప్పుడు తను ఎంత ఆనందపడిపోయాడో, ఈ కాలం పిల్లల సాహసాలు తల్చుకుంటూ ఎట్లా ఇంటికి చేరాడో, ఆనాటినుంచీ ఈ శుభ (మైకు దొరికే) క్షణాల కోసం ఎంత ఎదురుచూస్తున్నాడో, ఈ మీటింగుకి అరగంట ముందే వచ్చి ఎక్కడెక్కడ నిలుచున్నాడో- అంతా వర్ణించుకొచ్చాడు అరగంటసేపు. ఆరో వుపన్యాసకుడు ఒకసారి ఆగి, కొంచెం దగ్గి, ఫోటోగ్రాఫర్ల వేపు ఓ కన్నుపారేసి, జేబులోంచి చేతిరుమాలు బైటికి తీసి ఎందుకో సిద్ధంగా వుంచుకున్నాడు.

'హరిజనవాడల గురించి మీలో ఎంత మందికి తెలుసునో గానీ... హరిజనవాడలు... వూరికీ...పల్లె గానివ్వండి. పట్నం గానివ్వండి... వూరికి చాలా దూరాన వుంటాయి. అన్నీ చిన్న చిన్న గుడిసెలు... ఇరుకిరుకు సందులు... మనుషుల్ని రాసుకుంటూ పందులు తిరుగుతూ వుంటాయి. అక్కడ మురుగుగుంటల్లో దోమలు జుయ్యిమని లేస్తూ వుంటాయి... ఇదంతా నాకెలా తెలుసునంటారేమో నేను గాంధీ మహాత్ముడి బోధనలు విని,- ప్రభావితుణ్ణై హరిజనవాడల్లో తిరిగినవాడిని. నేనొక్కణ్ణే కాదనుకోండి. అప్పుడు నావంటి దేశసేవకులందరూ హరిజనవాడలు చూసి వచ్చేవారు'. ఆయన జేబురుమాలు ముక్కుదగ్గిర పెట్టుకుని హరిజనవాడల వర్ణన ముగించాడు- 'అటువంటి దుర్భర నరకాన్ని ఒక బ్రాహ్మణ కన్య తన మెట్టినింటిగా వరించింది అంటే-' అని ఆగి, 'ఈ దుర్ఘటన జరగాల్సిందేనా? ఈ పెళ్ళిని మనం ఆపలేమా?' అన్నట్టు మొహం పెట్టి విచారంగా నించున్నాడు.

'ఈ పెళ్లికూతురు వెళ్ళి ఆ మురికి హరిజనవాడలో కాపరం చెయ్యబోతోందా?'- అని కొందరు సభికులు ఆశ్చర్యపడుతున్నారు. 'ఇంతకీ ఏవంటాడీయన?' అని మరికొందరు విసుక్కుంటున్నారు. మరీ బొత్తిగా సాధుస్వభావులకీ, నిత్యమూ భగవద్గీత చదివేవాళ్ళని చూసేవాళ్ళకి తప్ప- మిగతావాళ్ళకి ఎక్కువగానో, తక్కువగానో కోపం వస్తోంది.

'ఇందుకు ముఖ్యంగా సుశీలాదేవి తండ్రిగారిని అభినందించి తీరాలి. సుశీలాదేవి తాతగారు కూడా నాకు బాగా తెలుసు. సంస్కృతం అంతా నేను వారిదగ్గరే నేర్చుకున్నాను. ఆయన నిప్పని కూడా కడిగే నిష్టాపరులు. నిజం చెప్పాలంటే ఈ కార్యానికి ఆయన ఆత్మ సంతోషించదనుకోండి. అయితే ఈనాడు మనం... పెద్దల ఆత్మసంతోషాల్నీ, దుఃఖాల్నీ పట్టించుకోమనుకోండి. పూర్వం పెద్దలు వాళ్ళ యుగధర్మం వాళ్ళు పాటించారు. ఈనాడు మన యుగధర్మం మనం పాటిస్తున్నాం...'

'మనం ఎంత కూల్‌డ్రింక్స్ ఇస్తే మాత్రం ఈ పెళ్ళి ముగిసేనాటికి ఈ సభలో ఒక్కరైనా వుంటారంటావా?' అంది సుశీల విసుగ్గా.

రాధాకృష్ణ మాట్లాడలేదు.

'నేనిక పోదల్చుకున్నాను. నువ్వు కూడా వస్తావా? లేకపోతే రేపు ఆఫీసులో కలుద్దాం' అంది మళ్ళీ.

రాధాకృష్ణ నిమ్మకు నీరెత్తినట్టు కూర్చుని వింటున్నాడు. ఏ తొంభయ్యో ఏటో రావలసిన వైరాగ్యం అతనికి పెళ్ళి నాడే పట్టుకున్నట్టుంది.

ఆరో వుపన్యాసం సాగుతోనే వుంది. గంటన్నర దాటి పోయింది. ఒక నిముషం ముందు మైక్ విడిచిపెడితే ఎంత కీర్తి వరిస్తుందో తెలిసి కూడా దాన్ని కాలదన్నేశాడాయన. జరిగినదంతా మళ్ళీ సింహావలోకనం చేస్తానంటున్నాడు.

'ఒక బ్రాహ్మణ యువతి... ఒక హరిజన యువకుణ్ణి...'

స్టేజి దూకి పరిగెత్తాలనుకుంది సుశీల.

ప్రేక్షకులు ఏదో ముంచుకుపోయినట్టు లేస్తున్నారు. అవతల పెద్దమనిషి మాట్లాడుతోండగానే.

'చాల్లే... దిగు... దిగు...' అని కూడా పిల్లకాయలెవరో అరిచారు.

వుపన్యాసకుడు కంగారుపడిపోయాడు. చాలా గంభీరంగా సభకు నమస్కారం పెట్టి, ఒక్క అడుగు వెనక్కి వేసి చప్పున పెళ్ళికొడుకు మీదికి వొంగి- 'ఏమన్నా మాట్టాడతావా అబ్బాయ్?' అనేశాడు. అసలు పెళ్ళికొడుకుని మాట్లాడమనాలని ఆయనకే కోశానా లేదు.

పెళ్ళికొడుకు హడలిపోయి సిగ్గుపడిపోయి, కుర్చీ లోపలికి దూరిపోయి- 'వూహూ... వొద్దండీ... నాకు రాదండీ...' అని మెలికలు చుట్టుకుపోయాడు.

మైక్ ఇస్తానంటే వొద్దనే మానవుణ్ణి వెర్రిచూపు చూసి మళ్ళీ తనే మైక్ దగ్గరికి వచ్చి- సభలో వాళ్ళంతా ఇలాగే హరిజన బాలికల్లో, బాలుళ్ళనో పెళ్ళాడి ఆ పెళ్ళికి తనని పిలిస్తే, తను ఎప్పుడూ వుపన్యాసాలిచ్చి సేవ చెయ్యడానికి సిద్ధంగా వుంటానని మనవి చేసి ఇక సభ నిజంగా ముగించబోయే మొహం పెట్టి- 'ఎవరైనా మంగళం పాడతారా?' అన్నాడు పెళ్ళికూతురి తండ్రికేసి చూసి 'మీరు పాడతారా' అన్నట్టు.

సుశీల చప్పున లేచి మైక్ దగ్గిరికి వస్తూ 'నేను కొంచెం మాట్లాడతాను' అంది.

పెళ్ళి పెద్ద ఆశ్చర్యపడిపోయి ఆమెని అప్పడే చూస్తున్నట్టు ఎగాదిగా చూశాడు.

సుశీల అప్పటికే మాట్లాడడం మొదలుపెట్టేసింది– 'నేను వుపన్యాసం ఇచ్చి మిమ్మల్ని విసిగించను. దయచేసి నాకు ఒక్క ఐదు నిమిషాలు టైమ్ ఇవ్వండి. నాలుగు మాటలు చెప్పి ఆపేస్తాను' అని ఆమె సభికుల్ని అర్థిస్తోంది.

పెళ్ళికొడుకు హడలిపోతున్నాడు.

వుపన్యాసకులు తెల్లబోతున్నారు.

సభాసదులు కంగారైపోతున్నారు.

ఎక్కడివాళ్ళక్కడ ఆశ్చర్యపడుతూ కూర్చుండిపోయారు.

సుశీలకేదో పూనకం వచ్చినట్టుంది. లేకపోతే అంత ఆవేశంగా అంత నిర్మొహమాటంగా ప్రారంభించగలిగేది కాదు.

'ఇప్పటికి ఆరుగురు వుపన్యాసకులు ఆరుగంటలసేపు మీ సహనాన్నీ, మా సహనాన్నీ పరీక్షకు పెట్టి చివరికి మనల్ని ఓడగొట్టి వాళ్ళే నెగ్గారు. ఇంత కష్టపడ్డందుకు ఒక్క మంచి మాట నేర్చుకున్నామా అంటే అదీ లేదు. మొదటి వుపన్యాసకుడి నించీ చివరివరకూ ఆరుగురూ ఒకటే పాట.

ఒక హరిజనుణ్ణి పెళ్ళాడడం...

ఒక హరిజనుణ్ణి పెళ్ళాడడం...

ఒక హరిజనుణ్ణి పెళ్ళాడడం...

సాహసం...

సాహసం...

సాహసం...

ఏమిటి సాహసం?

ఈ పెళ్ళి జరుగుతున్నది ఒక్కరికేనా?

ఇద్దరికి కాదా? బ్రాహ్మణయువతి హరిజన యువకుణ్ణి చేసుకోవడమే గానీ, హరిజన యువకుడు బ్రాహ్మణ యువతిని చేసుకోడం లేదా? పొగడ్తలన్నీ బ్రాహ్మణ యువతికేనా? హరిజనుడి పేరు ఒక్కరూ ఎత్త లేదేం?– హరిజనుడంటే ఎలాగూ తక్కువవాడే. ఆ తక్కువ వాడు బ్రాహ్మణ యువతిని పెళ్ళాడ్డంలో గొప్ప ఏమీ లేదు' అనేకదా మీ అందరి అభిప్రాయం. 'ఓ హరిజనుడా! నీలాంటి తక్కువవాణ్ణి ఒక బ్రాహ్మణ యువతి పెళ్ళాడి ఎంత త్యాగం, ఎంత సాహసం చేస్తోందో చూశావా?' అని ఇందరు సంస్కర్తలు బాహాటంగా చెప్పేస్తున్నారు.

ప్రతీ మాటలోనూ మీరుచేసే అవమానానికి ఆ హరిజనుడు ఎంత బాధపడతాడో, ఎంత గాయపడతాడో, ఎంత అసహ్యపడతాడో, ఒక్క సారైనా, ఒక్కసారైనా ఆలోచించారా? మీరు కూడా ఒక మానవుణ్ణి తక్కువవాడిగానే భావించినప్పడు ఇక మీరు చేసే కుల నిర్మూలన ఏమిటి?

కులాలు వొదిలేసి ఈ పెళ్ళి వేదిక మీద కూర్చున్న మమ్మల్ని పట్టుకుని బ్రాహ్మణ యువతీ అని హరిజన యువకుడా అంటూ మళ్ళీ మమ్మల్ని ఆ కులాల ద్వారానే గుర్తించడంలో మీ అభ్యుదయం ఏమిటి? బ్రాహ్మణత్వాన్ని తిరస్కరించిన నేను బ్రాహ్మణ యువతి నెలా అయ్యాను? హరిజనత్వానికి కట్టుబడని అతను ఇప్పడు కూడా హరిజనుడెలా అవుతాడు?– మనుషులు కులాన్ని వొదిలెయ్యడంలో ఈ సంస్కర్తల కేమీ నమ్మకం లేదా? మనుషుల్ని ఏదో ఒక కులం ద్వారా తప్పితే కులం లేని వాళ్ళగా గుర్తించలేరా? కులాన్ని వొదిలేసిన మమ్మల్ని మళ్ళీ పాత కులాల్లో చేర్చడానికి మీకేం హక్కు వుంది?

ఇప్పటికైనా అర్థం చేసుకోండి. మాకు కులాలు లేవు. మీ బ్రాహ్మణత్వాల్ని, హరిజనత్వాల్నీ మాకు అంటగట్టకండి!

మా పెళ్ళిని మేము రెండు కులాల వివాహంగానో, ఒక్క కులం వివాహంగానో, అసలు కులాల ప్రాతిపదికమీద జరుగుతున్న వివాహంగానో భావించడం లేదు. నేనూ రాధాకృష్ణా ఒకే ఆఫీసులో పనిచేస్తున్నాం. నాలు గేళ్ళనించీ స్నేహితులుగా వుంటున్నాం. మేమిద్దరం పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్న తర్వాత ఆ సంగతి మా ఇంట్లో చెప్పాను. నా తల్లి దండ్రులు అదిరిపడి అతని కులమేమిటన్నారు. అతనికి కులం లేదన్నాను. మనుషుల్ని కులాలతో గుర్తించడం నీచమనే సంగతి నేనూ రాధాకృష్ణా ఎప్పడో నేర్చుకున్నాం. మనుషులకు కులాలు వుంటాయనే సంగతి ఎప్పడో మరిచిపోయాం. రాధాకృష్ణ కులం ఏమిటో మావాళ్ళు ఆచూకీ తీశారు. 'మాలవాణ్ణి చేసుకుంటావా?' అని నామీద మండిపడ్డారు.

'అతను రాధాకృష్ణ. నేను రాధాకృష్ణని చేసుకుంటాను. మీరనే 'అమాల' వాళ్ళల్లో కూడా రాజేశ్వర్రావునో, చంద్రశేఖర్రావునో చేసుకోను. నేను రాధాకృష్ణని చేసుకుంటానని మళ్ళీ మళ్ళీ మీకు చెప్పదల్చుకోలేదు' అని తేల్చి చెప్పేశాను.

నా తల్లిదండ్రులు చాలా తొందరగానే కళ్ళు తెరిచి నా ఇష్టానికి నన్ను విడిచిపెట్టారు. అయితే పెళ్ళి మాత్రం దేవుడి గుళ్ళో చేసుకోవాలన్నారు. అలా ఎంత మాత్రం వీల్లేదన్నాను.

'నువ్వు కులం లేనివాణ్ణి చేసుకుంటున్నా మేం వొప్పకోడం లేదా?' అన్నారు.

'మీరు వొప్పకోడం మీదా, వొప్పకోకపోవడం మీదా నేనాధారపడడం లేదన్నాను.

చివరికి నా తల్లిదండ్రులు నా ఇష్టప్రకారమే చేస్తామని వొప్పకుని పెళ్ళి పెద్దరికం మాత్రం తమకే వదిలెయ్యమన్నారు. దానికి మాకేం అభ్యంతరం వుండదన్నాను.

అగ్నిదేవుళ్ళనీ, వానదేవుళ్ళనీ, గాలిదేవుళ్ళనీ పిలిచే మంత్రాల సాంప్రదాయాన్ని తిరస్కరించి ఈ మీటింగు పద్ధతికి వస్తే ఇక్కడ మంత్రాలు లేవు గానీ ఆ రకం మూలుగులన్నీ వున్నాయి. ఇక్కడ కులాల్ని వదల్లేని పెనుగులాటలున్నాయి. అంత శ్రమా, అంత డబ్బూ, అంత కాలం, ఇక్కడా ఖర్చవుతున్నాయి. పాత సాంప్రదాయాన్ని అధిగమించినప్పడు ఇది ఆదర్శప్రాయం అవుతుందేమో గానీ లేకపోతే దానికీ దీనికీ భేదం ఏమీ లేదు. మూడో మార్గం చూసుకోవలసిందే.

ఈ మీటింగు పెళ్ళిళ్ళ సంగతి మాకెప్పడూ తెలీదు. ఇక్కడ ఇంతమంది, ఇన్నేసి గంటలు తమ గొప్పలు చెప్పకుని సరదాగా పెళ్ళికొచ్చినవాళ్ళ పని పట్టిస్తారనీ, మా పెళ్ళిరోజు ఇంత మంది అమాయకులకింత గడ్డురోజవుతుందనీ మేము వూహించలేదు.

హరిజనుణ్ణి చేసుకుంటున్నానని ఇప్పటిదాకా నన్ను పొగడ్తలతో ముంచే శారు. హరిజన కులోద్ధరణ చెయ్యడానికి నేనీ పని చెయ్యడం లేదు. రాధాకృష్ణ హరిజనుడు గాక బ్రాహ్మడైతే కూడా నేను అతన్నే చేసుకునే దాన్ని. మా వివాహం మా స్నేహానురాగాల మీద ఆధారపడ్డదే గానీ నా కులోద్ధరణ మీద కాదు. ఈ పెళ్ళికి నేను చేస్తోన్న సాహసం ఏమీ లేదు. మా నాన్న చేస్తోన్న సాహసం అంతకన్నా లేదు. తమ సాంప్రదాయాల్ని ధిక్కరించే పన్నేమీ చెయ్యలేక ఈ పెళ్ళికి అంగీకరించాడు గానీ మా నాన్నకి హరిజనుల మీద ప్రేమ వుట్టుకొచ్చికాదు.'

సుశీల చప్పన ఆగి వాచీ చూసుకుంది– 'సభలో వారు నన్ను క్షమించాలి. ఒక్క నిమిషం ఎక్కువ మాట్లాడాను' అని ఆగి మైక్ దగ్గిర్నించి వెనక్కి వెళ్ళిపోయింది. అంతసేపూ విగ్రహంలా బిగుసుకు కూర్చున్న రాధాకృష్ణని చూస్తూ 'హరిజనుడూ! లే పోదాం' అని నవ్వింది.

సభ నిశ్శబ్దం!

జనం లేనంత నిశ్శబ్దం!

మైక్ ఖాళీగా వుంది!

ఆరేసి గంటలు వుపన్యసించగల ఆరుగురు మహావక్తల ముందు మైక్... ఎంత ఖాళీగా వుందో!